ప్రజాశక్తి

ఆదివారం 14 డిసెంబరు, 2025

5

శ్రీకాకుళం

రేపు టెక్కలిలో 'మీకోసం'

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈనెల 15న టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలోని అధికారులు పాల్గొంటారన్నారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి నేరుగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి, వాటి స్థితిదానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలంటే 1100 నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూటమి పార్టీల్లో అసంతృప్తి వాస్తవమే

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నాగబాబు

- బిజెపి, జనసేన కార్యకర్తలకు ప్రాధాన్యత లేదు
- ఎమ్మెల్యే ఈశ్వరరావుతో కలిసి అభివృద్ధికి కృషి
- జనసేన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు

ప్రజాశక్తి- లావేరు, ప్రతినిధి

కూటమిలోని జనసేన, బిజెపి పార్టీల్లో అసంతృప్తి ఉన్న మాట వాస్తవమేనని, త్వరలోనే అది సర్దుకుంటుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. లావేరు మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశం, అంతకు ముందు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం జనసేన, బిజెపి కార్యకర్తలుకు ప్రాధాన్యం లేదన్న భావన కార్యకర్తల్లో ఉందన్నారు. కూటమిలో తగిన గుర్తింపు కోసం గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరముందని అన్నారు. నెలలో వారం రోజులు పాటు లావేరు జనసేన కార్యాలయంలోనే కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తాను ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా తాను తప్పుకున్నానని అలా అయితే ఎమ్మెల్యేగా పోటీ చేసేవాడేనని విలేకరుల ప్రశ్నకు బదులిచ్చారు. ఎచ్చెర్ల నియోజకవర్గన్ని స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం ఎమ్మెల్సీగా తనను నియమించిన తర్వాత ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహించేందుకు ప్రభుత్వం ఇటీవల జిఒ విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్సీగా తాను ఎమ్మెల్యేగా ఈశ్వరరావు కృషి చేస్తామని ఈ ప్రాంత సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ఎచ్చెర్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటానని స్పష్టం చేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా సాగునీటి కాలువలు పనులు పూర్తిస్థాయిలో జరగక శివారు భూములకు సాగునీరందకపోవడం, రైతాంగం ఇబ్బందులు పడుతున్న అంశాన్ని విలేకరులు ఎమ్మెల్సీ నాగబాబు వద్ద ప్రస్తావించగా, సాగునీటి ప్రాజెక్టులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. గతంలో మొక్కజొన్న, ప్రత్తి కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనే పరిస్థితి ఉండగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అటువంటి ఏర్పాటు చేయకపోవడంతో దళారులు, వ్యాపారులు కుమ్మక్కై పంటను తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని విలేకరులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తమకు ఆ సమస్యను ఎవరూ చెప్పలేదని, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టిలో పెట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలకు చెందిన ఇన్‌ఛార్జిలు, మండల పార్టీలు అధ్యక్షులు, వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' విలేకరిపై నాగబాబు చిందులు

గతంలో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు జిల్లా పర్యటన సమయంలో ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వకుండానే సమీక్షలు, క్షేత్రస్థాయి పరిశీలనలు చేయడం, లావేరులో జనసేన ప్రాంతీయ పార్టీ కార్యాలయం ఏర్పాటుపై ప్రజాశక్తిలో వచ్చిన కథనాలపై ఆయన లావేరు విలేకరి పోతన్నదొరపై చిందులు తొక్కారు. సమావేశం నుంచి బయటకు వెళ్లాలంటూ నాగబాబు గదమాయించారు. సమావేశం ప్రారంభమవుతున్న సమయంలో మనకు వ్యతిరేకంగా ప్రజాశక్తిలో వార్తలు రాశారంటూ ఎమ్మెల్సీ నాగబాబుకు ఎచ్చెర్ల నియోజకవర్గ సమన్వయకర్త విశ్వక్సేన్ విలేకరిని చూపించారు. ఎమ్మెల్సీ నాగబాబు తన మనుషులను విలేకరి వద్దకు పంపి మీరు వెళ్లిపోవాలంటూ చెప్పారు. ఇటీవల తప్పుడు సమాచారంతో వార్తలు రాశారు, వెళ్లిపోవాలంటూ వేదికపై నుంచి ఎమ్మెల్సీ నాగబాబు కూడా చెప్పడంతో తాము రాసిన కథనాల్లో ఏం తప్పు ఉందో చెప్పాలని విలేకరి ప్రశ్నించారు. పరస్పరం వాగ్వాదం చోటు చేసుకుంటున్న సమయంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ పంచకర్ల సందీప్ జోక్యం చేసుకుని ప్రజాశక్తి విలేకరికి సర్దిచెప్పి బయటకు పంపారు. ఆ తర్వాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగబాబు మీడియాతో తాను ఏది మాట్లాడినా వివాదాస్పదం అవుతుందని, సమావేశం నుంచి ఓ పత్రికా విలేకరిని బయటకు పంపించినందుకు సారీ చెప్పారు.

కొండయ్య ఆశయసాధనకు కృషి

మాట్లాడుతున్న గోవిందరావు

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఐటియు జిల్లా వ్యవస్థాపకుల్లో తొలి తరం నాయకులు మెట్ట కొండయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు, ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు కె.మోహనరావు సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు, బి.కృష్ణమూర్తిలు పిలుపునిచ్చారు. పట్టణంలోని కొత్తకోట వారి వీధిలో కొండయ్య స్వగృహం వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అధ్యక్షతన శనివారం సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా కొండయ్య చిత్రపటానికి పూలమాలవేసి పలువురు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1970లో సిఐటియు ఆవిర్భవించినప్పుడు జిల్లాలోని ఆమదాలవలస సహకార చక్కెర కర్మాగారంలో కీర్తిశేషులు చాపర అప్పారావు, దిగుమర్తి విశ్వనాథం, మెట్ట కొండయ్య సిఐటియు యూనియన్ ఏర్పాటు చేశారని అన్నారు. కొండయ్య తుది శ్వాస విడిచే వరకు ప్రజలు, రైతులు కార్మికుల పక్షాన నిలిచి పోరాడారని అన్నారు. నిబద్ధత, క్రమశిక్షణ కలిగి ఆశయం కోసం పనిచేసే మహోన్నత వ్యక్తి అని అన్నారు. చక్కెర కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించారని గుర్తు చేశారు. అప్పటి నిర్బంధ రోజుల్లో కార్మికుల పక్షాన ఎర్ర జెండా పట్టుకుని ఎదురొడ్డి పోరాడిన కార్మిక నేత అని కొనియాడారు. అప్పటి ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావుకు వ్యతిరేకంగా నిలబడి కార్మికుల పక్షాన పోరాడటం సామాన్యమైన విషయం కాదని అన్నారు. చక్కెర కర్మాగార కార్మికులకు బోనస్ ఇవ్వాలని 56 రోజులపాటు చక్కెర కర్మాగారం సమ్మెలో కార్మికులకు బాసటగా తన భార్య బంగారాన్ని కుదువ పెట్టి ఉద్యమాన్ని ముందుకు నడిపించి విజయవంతమైన మహోన్నత వ్యక్తి అని అన్నారు. చక్కెర కర్మాగారం మూతపడిన తర్వాత సహకార రంగంలోనే కొనసాగించాలని పలు ఉద్యమాలు పోరాటాలు ఉధృతంగా చేశారని గుర్తు చేశారు. గ్రామాల్లో సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ప్రచారం చేసి కార్మికులు, కర్షకుల హక్కుల కోసం పోరాడిన యోధుడని అన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వాలు కార్మిక వర్గాలు తరతరాలుగా సాధించుకున్న కార్మికుల చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా తెచ్చి యాజమాన్యాలకు కట్టు బానిసలుగా చేస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేయడమే కొండయ్యకు మనమిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో కొండయ్య కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, బొడ్డేపల్లి మోహనరావు, సీనియర్ జర్నలిస్టు సువ్వారి మురళి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పంచాది లతాదేవి పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

జిల్లాలో 35 పరీక్షా కేంద్రాల్లో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డి.భేతన్నస్వామి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు జిల్లాలో మొత్తం 7,936 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 6,946 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. 990 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన ఏర్పాట్లు చేసి పరీక్షను సజావుగా నిర్వహించామని వెల్లడించారు.

పలాస : పలాస, కాశీబుగ్గ ప్రభుత్వ ఉన్నత, శ్రీచైతన్య పాఠశాలల్లో నిర్వహించిన నవోదయ పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. మండలంలో 682 మంది విద్యార్థులు పరీక్షలు రాల్సి ఉండగా, 631 మంది విద్యార్థులు హాజరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో 25 మంది, పలాస ప్రభుత్వ పాఠశాలలో 12 మంది, శ్రీచైతన్య పాఠశాలలో 14 మంది హాజరని తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాలు వద్ద తాగునీరు, పోలీసు సిబ్బంది, మెడికల్ సిబ్బందిని నియమించారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో మూడు కేంద్రాల్లో జవహర్ నవోదయ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. విద్యాలయాలకు ఆరో తరగతిలో ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత, మున్సిపల్ బాలికొన్నత పాఠశాలలు, స్వర్ణభారతి విద్య సంస్థలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 288 మంది విద్యార్థులకు 271 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకర సూర్యారావు, క్లస్టర్ లెవెల్ అబ్జర్వర్‌గా కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్ వ్యవహరించారు. డిపార్టమెంట్ అధికారిగా కవిటి మండల ఎంఇఒ మజ్జి ధనుంజయ పర్యవేక్షించారు. మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో 249 మందికి 232 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా పైడి గోపాలరావు, క్లస్టర్ లెవెల్ అధికారిగా కె.రామ్మోహనరావు వ్యవహరించారు. స్వర్ణభారతిలో 288 మందికి 261 మంది పరీక్షలు రాశారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా హేమంత్ రవి, లైజినింగ్ ఆఫీసర్‌గా ఎ.సురేష్ వ్యవహరించారు. నవోదయ పరీక్షలు వల్ల పాత స్టేట్ బ్యాంకు రోడ్డులో విద్యార్థులతో కిటకిటలాడింది. దీంతో వాహన రాకపోకలు కొద్దిసేపు ఆటంకం కలిగింది.

ఇచ్ఛాపురం : పరీక్ష రాస్తేందుకు వచ్చిన విద్యార్థులు

మందస: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు 288 మంది విద్యార్థులకు 25 మంది, ఆర్.పురం ఎపి గురుకుల బాలికల విద్యాలయంలో 236 విద్యార్థులకు 11 మంది గైర్హాజరయ్యారయ్యారని ఎంఇఒ ఎం.లక్ష్మణరావు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలకు నిర్వహణాధికారిగా మక్క శ్రీనివాసరావు, డిపార్ట్‌మెంట్ అధికారిగా అక్కినేని సాంబమూర్తి, మల్లికార్జునరావు వ్యవహరించారు.

16న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నా

మాట్లాడుతున్న బలరాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16న అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) నిర్ణయించినట్లు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.బలరాం, సిఐటియు నగర కార్యదర్శి ఆర్.ప్రకాశరావు తెలిపారు. ఇందిరానగర్ కాలనీ సిఐటియు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరితే అధికారుల వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగర విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచకుండా పనిభారం మోపడం అన్యాయమని అన్నారు. పారిశుధ్య కార్మికులను భర్తీ పేరుతో కాంట్రాక్టు ఏజెన్సీ రూ.లక్షలు వసూల్ చేస్తోందని అన్నారు. దీనిపై గతంలో ఫిర్యాదు చేసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. 12వ పిఆర్‌సి కమిటీని నియమించి, మున్సిపల్ కార్మికులందరికీ వేతనాలు పెంచాలని గత జూలైలో రాష్ట్ర వ్యాప్తంగా పది రోజులు, పారిశుధ్య కార్మికులు ఏడు రోజులు సమ్మె చేశారని అన్నారు. ఈ సమ్మె కాలపు జీతం చెల్లించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని, ఇందుకు సంబంధించి జిఒ జారీచేయాలని కోరారు. రెగ్యులర్ కార్మికులకు డిఎ బకాయిలు, సరండర్ లీవ్‌లు ఎన్ క్యాష్మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బదిలీ, కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎ.శంకర్, గణేష్, ఎ.జ్యోతిప్రసాద్, ఎ.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ప్రజాదర్బార్ నిలుస్తుందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. కార్యాలయానికి వచ్చి వినతపత్రం అందించిన వారి వినతని స్వయంగా పరిశీలించి బాధలు వింటూ భరోసా కల్పిస్తున్నారు. సత్వరమే ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, దీపం-2.0, స్త్రీశక్తి, తల్లికి వందనం వంటి కీలక పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని వెల్లడించారు. ఈ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రహదారులు మంజూరు చేయాలని పలువు వినతపత్రం అందించారు. నూతన పింఛన్లు మంజూరు, నూతన నివాసాలు. మంజూరు చేయాలని, ప్రజల నుంచి వినత పత్రాలు అందజేశారు. త్వరలోనే మంజూరు చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన విఠల్‌రావు

మంత్రి అచ్చెన్నాయుడుని జిల్లా గ్రంథాల ఛైర్మన్ విఠల్‌రావు నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ప్రభుత్వం జిల్లా గ్రంథాల ఛైర్మన్‌గా విఠల్ రావును నియమించిన నేపథ్యంలో ఈ భేటీ అయ్యారు. ఈ మేరకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేసి, పఠన సంస్కృతిని ప్రజల్లో పెంపొందించేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం మంత్రికి దుశ్శాలువ కప్పి సన్మానించారు.

సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్...

ప్రభుత్వాస్పత్రికి వైద్యం కోసం వచ్చే ప్రతి రోగికీ సిబ్బంది నాణ్యమైన, మానవీయ వైద్య సేవలు అందించాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కాకుళం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సూపరింటెండెంట్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ నిమ్మాడలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

టెక్కలి రూరల్ : టెక్కలిలో అన్యాక్రాంతంమైన భూమిలను విడిచిపెట్టేది లేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం నిర్మాణం చేపడుతున్న అన్ని కాంటీన్ పనులు పరిశీలించారు. రాష్ట్రంలో పేదల ఆకలి, బాధలను తీర్చే మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్లు సామాజిక భద్రతకు ప్రతీకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. టెక్కలిలో నిర్మాణం చేపడుతున్న అన్న క్యాంటీన్ నిర్మాణ పనుల నాణ్యతను మంత్రి స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బగాది శేషగిరిరావు, టిడిపి మండల అధ్యక్షులు పినాకాన అజయ్ కుమార్, చాపర గణపతిరావు, హనుమంతు రామకృష్ణ, కోల లవకుమార్, కోల కామేశ్వరరావు, లొల్లి ప్రసాద్‌రెడ్డి, దవళ రామచందరరావు పాల్గొన్నారు.

వైద్యరంగాన్ని ప్రైవేటుపరం చేస్తే ఉరుకోం

వైసిపి పార్లమెంటరీ పరిశీలకులు కంభా రవిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వైఎస్‌ఆర్ అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ.... చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమానికి అంచనాలకు మించి స్పందన వచ్చిందని వైసిపి పార్లమెంటరీ పరిశీలకులు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు 53 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేశారని అన్నారు. పేదల ఆరోగ్యమన్నా... వైద్యమన్నా చంద్రబాబుకి ఎందుకంత నిర్లక్ష్యమో అర్థం కావడం లేదన్నారు. 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయకుండా చేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రాలు ప్రత్యేక వాహనంలో ఈ నెల 15న కేంద్ర పార్టీ కార్యాలయానికి వెళ్లనున్నాయని తెలిపారు. కోటి సంతకాల విజయవంతం సందర్భంగా ఈ నెల 14న ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం నగరం టౌన్‌హాల్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య విద్యకు తూట్లు పోడవడం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ... చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమానికి అంచనాలకు మించి స్పందన వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ధనవంతుల పల్లకీ మోస్తున్న ప్రభుత్వం

మాజీ మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

తన రాజకీయ జీవితంలో సిఎం చంద్రబాబు ప్రజలకు, పేదలకు ఉపయోగపడే ఒక్క సంస్కరణా చేయలేదని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తేల్చి చెప్పారు. 18 నెలల పాలనలో పేదల కోసం ఒక ఎకరా భూమీ కొనుగోలు చేయలేదు సరికదా... పేదలను కొట్టి పెద్దలకు పంచడమే నైజంగా చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని నాగావళిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూశాఖపై సమీక్ష చేయడానికి ఏడాదిన్నర సమయం తీసుకోవడమే సిఎం పేదలపై, వారి సంక్షేమంపై తీరుకు నిదర్శమని పేర్కొన్నారు. 2020లో మాజీ సిఎం జగన్ తీసుకొచ్చిన భూసంస్కరణల వల్లే పేదలకు మేలు చేకూరుతుందని అన్నారు. గ్రామకంఠం, చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం జగన్ చూపారని అన్నారు.

18న పెన్షన్ అదాలత్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం, ఉద్యోగ విరమణకు ముందే పింఛను ప్రయోజనాలను మంజూరు చేసే ప్రక్రియపై డిడిఒలు, పిఎస్‌ఎలకు పూర్తి అవగాహన కల్పించడమే ఈ అదాలత్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు నిర్వహించే అదాలత్‌లో పెన్షన్లు, జిపిఎఫ్, అకౌంట్స్ విభాగాల సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, పింఛను ప్రపోజల్స్ సరైన సమర్పణపై మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల అధికారులు, పింఛనుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా పింఛనుదారులు, అధికారుల మధ్య దూరం తగ్గి, సమస్యల పరిష్కారానికి ఒక వేదిక లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు



ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈ నెల 14 నుంచి 20 వరకు ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఎపిఇపిడిసియల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యుత్ పొదుపు అవగాహనా ర్యాలీలు జిల్లా ప్రధాన కేంద్రం డివిజన్ కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. స్వయం సహాయక మహిళా బృందాలతో ముగ్గుల పోటీలు నిర్వహించి వారికి ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్, గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై నిష్ణాతులతో ఇంజినీర్ కాలేజీల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఉంటాయన్నారు. 20న విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

వేదికలపై ఉపన్యాసం... అభివృద్ధిపై అస్త్ర సన్యాసం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వేదికలు ఎక్కితే చాలు అభివృద్ధిపై నేతల ఉపన్యాసాలు అనర్గళంగా సాగిపోతాయి. వారి ప్రసంగాలు వింటే నిజంగా జిల్లాపై వీరికి ఎంత ప్రేమో అని అంతా అనుకుంటారు. సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకూ నీళ్లిస్తామని, జిల్లాను సస్యశ్యామలం చేసేస్తామని చెప్తుంటారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అయితే టిడిపి హయంలోనే జిల్లా అభివృద్ధి జరిగిందంటూ ఒక్కోసారి ప్రతిపక్ష పార్టీలకు సవాల్ కూడా విసురుతుంటారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అయితే జిల్లాకు పరిశ్రమలు తీసుకొచ్చి వలసలు నివారిస్తామని, అభివృద్ధిలో సిక్కోలును అగ్రపథంలో నిలబెడతామని అనేక సభల్లో ప్రసంగించడం మనం చూశాం. వీరి అభివృద్ధి మాటల్లో ఉన్న పస ఏపాటితో ఏడాదిన్నర టిడిపి కూటమి పాలనలో జిల్లాకు ఏం తీసుకొచ్చారో చూస్తే అర్థమవుతుంది. ఆ మధ్య విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో ప్రభుత్వం అనేక ఒప్పందాలు చేసుకున్నా వెనుకబడిన జిల్లాకు ఒక్క పరిశ్రమ రాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ తరుచూ విశాఖలో పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు చేసి వెళ్తున్నారు తప్ప వలసల జిల్లాగా పేరొందిన శ్రీకాకుళానికి ఒక పరిశ్రమ కేటాయిద్దామని వారికీ అనిపించడం లేదు. అడగాలనీ వీరికి అనిపించడం లేదు. వందల కోట్ల పెట్టుబడులు, వేలాది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలను కావాలని అడగటానికి నోరు రాని ఇరువురు మంత్రులు ఉన్న ఉపాధిని దూరం చేసే ఎయిర్‌పోర్టులు, థర్మల్ పవర్ ప్లాంట్లను ప్రజల నెత్తిన రుద్దటానికి మాత్రం ముందుంటున్నారు. మందస ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు వద్దని, బలవంతపు భూసేకరణ ఆపాలని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మొండిగా ముందుకు వెళ్తున్న పరిస్థితిని చూస్తున్నాం. కార్గో ఎయిర్‌పోర్టుతో ప్రజలకు ఏమైనా ఉపయోగమంటే అదీ లేదు. ఉపాధి, ఉద్యోగాలు వస్తాయంటూ భ్రమలు కల్పిస్తున్నారు. ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలు అందుకు తగిన అర్హతలు ఉన్న యువతకు వస్తాయి తప్ప స్థానిక యువకులకు ప్రత్యేకంగా ఇచ్చే ఉద్యోగాలు అంటూ ఉండవనే విషయం ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లోని ఎయిర్‌పోర్టుకు భూములిచ్చిన ఉన్న ప్రాంతాల ప్రజలను అడిగితే తెలుస్తుంది. ఉద్యోగాలు, ఉపాధి పేరుతో భూములు తీసుకుని ఎయిర్‌పోర్టు పని నెరవేర్చుకోవడానికి తప్ప ఇందులో ప్రజలకు ఏరకంగానూ ఉపయోగం లేదనే చర్చ నడుస్తోంది. మూలపేట పోర్టు, అక్కడి ఇండస్ట్రీయల్ కారిడర్‌కు వచ్చే కొంత బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లు రాకపోకలు సాగించడానికి తప్ప మందస ఎయిర్‌పోర్టుతో ఏం ఉపయోగం లేదనేది అటు ఉద్యోగుల్లోనూ చర్చ నడుస్తోంది. మరో వైపు సముద్ర తీర భూములు, కొండలు కలిపి పది వేల ఎకరాలను కార్పొరేట్లకు అప్పగించడానికే ప్రభుత్వం ఎయిర్‌పోర్టు నిర్మిస్తోందన్న స్థానికుల్లో చర్చ నడుస్తోంది. ప్రజలకు ఏరకంగానూ ఉపయోగం లేని ఎయిర్‌పోర్టుపై శ్రద్ధ చూపుతున్న బాబాయ్, అబ్బాయ్‌లు జిల్లా అభివృద్ధికి దోహదపడే పరిశ్రమలు తీసుకురావడంపై కనీసం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా ఉన్న పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంపైనా దృష్టి సారించడం లేదు. జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన వంశధార, ఆఫ్‌షోర్, హైవెల్ కెనాల్, హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద ఎత్తిపోతల పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టు పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు బిల్లులు, కాలువ తవ్వకాలకు భూములు ఇచ్చిన రైతులకు డబ్బులుకు ఇచ్చేందుకు ప్రభుత్వానికి మనస్కరించడం లేదు. వంశధార పూర్తికి రూ.172 కోట్లు ఇస్తే పూర్తవుతుంది. హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద ఎత్తిపోతల పథకం పూర్తి కావాలంటే రూ.176 కోట్లు కావాలి. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తికి రూ.300 కోట్లు కేటాయిస్తే పూర్తయితే వేల ఎకరాలకు సాగు నీరందే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం నిధులు కేటాయించదు, వీరు అడగడమూ లేదు. ఈ ఏడాది మేలో జిల్లా పర్యటనకు వచ్చిన జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష చేసి నివేదికలు పంపండి క్లియరెన్స్ ఇస్తానంటూ గొప్పగా ప్రకటించారు. ఆరు మాసాలు గడుస్తున్నా వాటికీ అతీగతీ లేకుండా పోయింది. రాయలసీమకు వేల కోట్లను కుమ్మరించి ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నామంటూ ప్రభుత్వం చెప్పడం ప్రజలను మోసగించడమే అవుతుంది. అధికారుల నుంచి ప్రతిపాదనలు రావడం లేదని, అందరికీ డబ్బులు వెళ్లిపోతున్నాయని ఇటీవల సాగునీటి సలహా మండలి సమావేశంలో స్వయంగా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడే వ్యాఖ్యానించడం చూశాం. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకుండా, ఉపాధి కల్పించే పరిశ్రమలను జిల్లాకు తీసుకురాకుండా అభివృద్ధి అంటూ మాటలు చెప్తూ ప్రజలను ఎల్లకాలం భ్రమల్లో ఉంచుతామంటే ఎక్కువ కాలం సాగదు. తాము మోసపోయామని జనం గుర్తించిన రోజున వారిచ్చే తీర్పు ఏ స్థాయిలో ఉంటుందో కనీసం ఊహించడానికి అవకాశం ఉండదు. ఈ విషయాన్ని నేతలు ఎంత వేగంగా గుర్తిస్తే అంత మంచిది.

IN THE HON'BLE COURT OF THE CIVIL JUDGE SENIOR DIVISION TEKKALI
O.S. No: 16/2023

Between:-
Puli Vinaya Bhushanam -----Plaintiff
And:-
1- Puli parvathi, W/o, Late Nityanadha Rao, Aged by 66 year, Door. No: 19-466, Adhi Andhra Street, Tekkali Town and post, Tekkali Mandal, Srikakulam District.
2- Puli Sara Nava Roja, W/o Paka Krupanandham, Aged 47 years, resident at Door No:19-466, Adhi Andhra Street, Tekkali Town and post, Tekkali Mandal, Srikakulam District.
3. Paka Krupanandham, S/o Late Heniy aged about 52 Years, Door. No: 19-466, Adi Andhra Street, Tekkali Town and post, Tekkali Mandal, Srikakulam District.
------Defendants

NOTICE

Please take notice that the plaintiff filed the above suit for partation of the plaint Schedule property Into 3 equal shares one to allot one such share to the plaintiff after Converting joint possession into Seperate possession you all the Defendants In the above Suit. you all avoiding to take Summones Sent by the HON'BLE Court and even though notices were sent for several times. The case stands posted **18-12-2025 at 10.30 AM.** for you all apperance before the HON'BLE Court at Tekkali and failing which the will be decided in your absence

KALLA RAJESWARA RAO
ADVOCATE,
SOMPETA, SRIKAKULAM DIST.

మహాసభలను జయప్రదం చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల: డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో ఐదురోజుల పాటు జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ పిలుపునిచ్చారు. జనవరి 4న విశాఖపట్నం ఆర్.కె.బీచ్ వద్ద జరిగే భారీ బహిరంగ సభలో యావన్మంది కార్మిక వర్గం పాల్గొనాలని, శ్యాంపిస్టన్స్ ప్లాంట్ 3 వద్ద సిఐటియు అఖిల భారత మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందన్నారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మికవర్గ పోరాటాలను నిర్మించేందుకు జరిగే ఈ మహాసభలు దోహదపడతాయన్నారు. కార్మిక హక్కులను కార్పొరేట్‌ల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. కేంద్రంలో బిజెపి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్‌ల ప్రయోజనాల కోసం కార్మిక హక్కులు కాలరాస్తూ 29 కార్మికచట్టాల స్థానంలో లేబర్ కోడ్లు తీసుకువచ్చారని విమర్శించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశ తదితర స్కీమ్ వర్కర్లకు వేతనాలు పెంచాలని, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ, గ్రాట్యుటీ తదితర సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్యాంపిస్టన్స్ ప్లాంట్ 3 స్టాఫ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్.నాగరాజు, ఎం.సూర్య నారాయణ, పి.నాగరాజు, ఎల్.చక్రవర్తి, జె.సురేష్, ఎస్. శ్రీను, పి.రామకృష్ణ, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఇన్‌ఛార్జికి పోటాపోటీ

రాజ్యలక్ష్మి

శ్యామప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి ఘోరంగా ఓటమి చెందినా... ఇన్‌ఛార్జి పదవి కోసం ఆశలు మాత్రం ఆశావహులు వదులు కోవం లేదు. నియోజకవర్గం సమన్వయకర్త, ఇన్‌ఛార్జి కోసం తెరవెనుక ఎన్నో రాజకీయాలు చేసిన వైసిపి పెద్దలు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియ విజయానే ఇప్పటి వరకు కొనసాగిస్తూ వచ్చారు. తాజాగా కోటి సంతకాలు సేకరణ పత్రాలు పూర్తి అయిన తర్వాత ఒక్కసారిగా ఇన్‌ఛార్జి మార్పు తెరపైకి వచ్చింది. పార్టీలో ప్రధాన సామాజిక తరగతికి దూరం అవుతున్న నేపథ్యంలో ఇన్‌ఛార్జి మార్పు తప్పనసరి పెద్దలు సంకేతాలు ఇచ్చారు. దీంతో వైసిపి రాజకీయాలు తారస్థాయికి చేరాయి. అయితే ఈ పదవి కేవలం రెడ్డికకు కట్టబెట్టాలన్న ఆలోచన పెద్దలకు ఉన్నట్టు సమాచారం. యాదవల నుంచి ఎమ్మెల్సీగా నర్తు రామారావు పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక మిగిలింది రెడ్డికకు ప్రాధాన్యత కల్పించాలని వైసిపి పెద్దలు గట్టి నిర్ణయంతో ఉన్నట్లు కిందిస్థాయి నాయకులు బహిరంగ చెపుతున్నాయి. రెడ్డిక నుంచి ప్రధానంగా మాజీ సమన్వయ కర్త, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పైలా దేవదాస్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. జిల్లా పెద్దల ఆశీస్సులు మాత్రం రాజ్యలక్ష్మి ఉంటాయని, రాష్ట్ర నాయకత్వం పరిశీలనలో శ్యామ్ ప్రసాద్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇద్దరుకీ కాకపోతే దేవదాస్‌రెడ్డి పేరు పరిశీలనలో తీసుకోవచ్చు. నియోజకవర్గం బాధ్యత అంటే ఆషామాషీ కాదు. నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో ఉంటున్న వైసిపి నాయకులను ఒక తాటిపైకి తీసుకుని రావాలి. పార్టీ సమావేశాలు, పార్టీ చేపట్టే ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు ధైర్యంగా నిలబడి పోరాడాల్సిన పరిస్థితులు ఉంటాయి. దీంతో పాటు ఆర్థికంగా ఖర్చులూ భారీగా చేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మికి కష్టసాధ్యమే. నియోజకవర్గంలో మున్సిపాలిటీ మినహా పెద్దగా ఏ మండలంతోనూ సత్సంబంధాలు లేవని చెప్పవచ్చు. మొత్తం పార్టీ క్యాడర్‌ను తిప్పుకొనేందుకు చాలా సమయం పడుతుందని పార్టీకి చెందిన సీనియకులు అంటున్నారు. శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో పార్టీ క్యాడర్‌తో కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు పరిచయాలు పెంచుకున్నారు. మొదటి నుంచీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోసం సాయశక్తులా ప్రయత్నాలు చేయడం వల్లక్యాడర్‌తో గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై పట్టు సంపాదించారు. ఇది ఒకరకంగా ప్లస్ పాయింట్ అవుతుంది. ఇక కంచిలి మండలానికి చెందిన పైలా దేవదాస్ రెడ్డికి కొంత క్యాడర్ మద్దతు లభిస్తుంది. అధికారం లేని సమయంలో ఇన్‌ఛార్జి పదవి కోసం పోటీ పడడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఇందులో ఎవరైనా మళ్లీ గ్రూప్‌లు తప్పవని సీనియర్లు కొంత మంది ఆరోపిస్తున్నారు. మొత్తం మీద ఇన్‌ఛార్జి కోసం ఇద్దరు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తుంది. శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, పిలక రాజ్యలక్ష్మి ప్రముఖంగా వినిపిస్తోంది.

పనులను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

రహదారులపై గోతులు పూడ్చివేత

ఆర్అండ్‌బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో రూ.2,500 కోట్లుతో రహదారులపై గుంతలను పూడ్చివేసేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర ఆర్అండ్‌బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పర్యటనలో భాగంగా శనివారం రాజాం – చిలకపాలెం రహదారిలో గుంతల పూడ్చివేత పనులను ఆయన పరిశీలించారు. రాష్ట్రంలో సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారుల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రహదారులపై గుంతల పూడ్చివేతలో ఆలసత్వం వహించరాదని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రహదారుల పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలను చేశారు. ఈయన వెంట ఆర్అండ్‌బి అడ్మిన్ వి.రామచంద్ర, ఎస్ఇ పి.సత్యనారాయణ, ఇఇ తిరుపతిరావు, డిఇ గణపతిరావు, ఎఇ పి.టి.రాజు, తదితరులున్నారు.

లాంగ్‌జంప్‌లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధిలో సంత సీతారామపురంలోని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో క్రీడల పోటీలను డీన్ డా. జి.రామచంద్రరావు ప్రారంభించారు. 18 వ్యవసాయ కళాశాలల నుంచి 530 మంది క్రీడాకారులు హాజరయ్యారు. లాంగ్‌జంప్‌లో తిరుపతి వ్యవసాయ కళాశాలకు చెందిన అక్షయ్‌జయన్ స్వర్ణ పతకం, ఉదయగిరి వ్యవసాయ కళాశాలకు చెందిన వైకుంఠ లక్ష్మణ్ వెండి పతకం, నైరా వ్యవసాయ కళాశాలకు చెందిన కె.సన్నీ రజిత పతకం, 100 మీటర్ల రన్నింగ్‌లో తిరుపతి వ్యవసాయ కళాశాలకు చెందిన కె.హరికృష్ణ స్వర్ణ పతకం, నైరా కళాశాలకు చెందిన కె.సన్నీ వెండి పతకం, తాడిపత్రి జెసి దివాకర్ రెడ్డి వ్యవసాయ కళాశాలకు చెందిన పి.పుష్పేంద్ర రెడ్డికి రజిత పతకం, షాట్ పుట్‌లో మహానంది వ్యవసాయ కళాశాలకు చెందిన ఎం.గిరీష్ స్వర్ణ పతకం, బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన అంకిత్‌కు వెండి పతకం, తాడిపత్రి జెసి దివాకర్ రెడ్డి వ్యవసాయ కళాశాలకు చెందిన ఎస్.జగన్నాథ్‌కుమార్‌కు రజిత పథకం దక్కాయి. విజేతలకు స్కై వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎల్.నారం నాయుడు అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ విజయకుమార్

గొప్పిలిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గొప్పిలిలో కెనరా బ్యాంకు సహకారంతో రూ.పది లక్షలు ఆర్థిక సహాయంతో అభివృద్ధి చేపట్టామని సర్పంచ్ పల్లి జయసుధ యోగి, ఎంపిటిసి ప్రతినిధి కొల్లాన ఆనందరావు తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో చిల్డ్రన్ పార్కు నిర్మాణానికి రూ.లక్ష, ఇళ్ల స్థలాల లేఅవుట్‌లో వాటర్ స్కీమ్ ఏర్పాటుకు రూ.1.20 లోలు, మహారాణి కోనేరుకు సిమెంట్ కుర్చీలు, బెంచీల ఏర్పాటుకు రూ.1.30 లక్షలు, కొల్లాన చెరువుకు సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.3.30 లోలు, పాముల వీధిలో తాగునీటి పథకానికి రూ.లక్ష మంజూరు చేశారన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలల అభివృద్ధికి రూ.లక్ష చొప్పున నిధులు వినియోగించనున్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ గేదెల విజయ్ కుమార్, కార్యదర్శి పోలాకి సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆస్పత్రి నిర్మాణానికి నిధుల కేటాయింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

బూర్జ మండలంలోని బూర్జ గ్రామంలో ఆయుష్ ఆస్పత్రి (ఆయుర్వేద) నిర్మాణానికి ప్రభుత్వం రూ.30 లక్షల నిధులను కేటాయించినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆస్పత్రికి నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బస్సుపై వేలాడుతున్న విద్యార్థులు

వెళ్లాల్సిందే... వేలాడాల్సిందే

ప్రజాశక్తి- బూర్జ

పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఎంత ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారో ఈ చిత్రం చూస్తే అర్థమవుతుంది. మండలంలోని లక్కుపురం, ఉప్పినవలస, పాలవలస, బూర్జ గ్రామాల జంక్షన్ నుంచి ఇటు పాలకొండ అటు ఆమదాలవలస, శ్రీకాకుళం పట్టణాలకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రతిరోజు ఇలా బస్సుల్లో వేలాడుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రమాదకరమైన ప్రయాణం అని తెలిసినా చేసేదేమీ లేక నిర్ణీత సమయానికి పాఠశాలకు చేరాలనే ఆత్రుతలో ఇలా వేలాడుతూ ఫీట్లు చేస్తూ వెళ్తున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఈ మార్గంలో రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడం అందుకు కారణం. ఇప్పటికైనా నిర్ణీత వేళల్లో అదనపు సర్వీసులు పెంచాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కుక్కల సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలో ప్రజలను కుక్కల బెడద నుంచి కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర కన్వీనర్ ఎం.గోవర్ధనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో అన్నికాలనీల్లో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందని, ముఖ్యంగా వాకర్స్, స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే పిల్లల బాధలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ మార్కెట్‌కు వెళ్లే పాదచారులను వెంబడించి వారి చేతుల్లో ఉన్న వస్తువులు, టిఫిన్ పాకెట్స్ సంచులపై దాడి చేస్తున్నాయన్నారు. రోజూ నగరంలో పదుల సంఖ్యలో ప్రజలు దాడులకు గురవుతున్నారని, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడించి దాడులు చేస్తున్నాయన్నారు. ఈ విషయంలో స్థానిక నగర కార్పొరేషన్ కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని, ఈ విషయంపై సుప్రీం కోర్టు ఉత్తర్వులు తక్షణమే అమలు చేయాలని, అదేవిధంగా పంచాయతీ విలీన కాలనీల్లో బ్లీచింగ్ చల్లించాలని, దోమల మందు పిచికారీ చేయాలని కోరారు. ఇప్పటికే ఈ సమస్యలపై మొమోరాండం ఇచ్చామని, స్పందించి చర్యలు తీసుకోవడంలో కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న కాలనీల ప్రజలతో సమానంగా పంచాయతీ కాలనీల ప్రజల వద్ద నుంచి పన్నులు వసూలు చేస్తూ సరైన మౌలిక వసతులు కల్పించకపోవడం అన్యాయమని విమర్శించారు.

16న నియోజకవర్గ గణిత పోటీలు

ఇచ్ఛాపురం : గణిత దినోత్సవం సందర్భంగా ఈ నెల 16న మున్సిపల్ బాలికల హైస్కూల్ నియోజకవర్గస్థాయి గణత పోటీలు నిర్వహిస్తున్నట్టు గణిత ఫోరం మండల ప్రతినిధి, గణిత స్కూల్ అసిస్టెంట్ కాగాపు తేజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల నుంచి విద్యార్థులు పాల్గొవాలని కోరారు.

టెన్నికాయిట్ పోటీలకు శిక్షణ

పలాస : పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జాతీయ టెన్నికాయిట్ పోటీలకు శిక్షణా శిబిరం శనివారం ప్రారంభమైంది. రాష్ట్ర టెన్నికాయిట్ సంఘ ఉపాధ్యక్షుడు పి.తవిటయ్య ఆధ్వర్యాన ఈ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లా సంతోష్‌కుమార్, ఎస్.వి.జోగారావు, ప్రధానోపాధ్యాయుడు పి.రవికుమార్, శిక్షకుడు ఎం.దామోదర్ పాల్గొన్నారు. ఈ శిబిరంలో వివిధ జిల్లాల నుంచి ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలు ఉన్నారు. మరో ఇద్దరు రావాల్సి ఉంది. కాగా, ఈనెల 22 నుంచి కేరళలో జాతీయ పోటీలు నిర్వస్తారని తెలిపారు.

ఫార్మ్ ఫండ్స్ పనులు వేగవంతం

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రారంభం చేసిన ఫార్మ్ ఫండ్స్ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కమిషనర్ సాగర్ ఆదేశించారు. శనివారం పిరువాడ పంచాయతీలో రూ.1.50 కోట్లతో ప్రారంభించిన అమృత సరోవర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు ఏ మేరకు పూర్తి చేశారనేవి నిశితంగా పరిశీలించారు. వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ లవరాజు, ఎపిడి, ఎపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

భైరిపురం సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- కవిటి

రమాదేవి (ఫైల్)

మండలంలోని భైరిపురం పంచాయతీ సర్పంచ్ పుల్లట రమాదేవి (60) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం కన్నుమూశారు. ఆమెకు భర్త ప్రభాకరరావు, ఇద్దరు పిల్లలు వంశీధర్, విద్యాధర్ ఉన్నారు. వంశీధర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండగా, విద్యాధర్ వైద్య వృత్తిలో ఉన్నారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా ముందుండే రమాదేవి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువకుడు ఆత్మహత్య

ఉమామహేశ్వరరావు (ఫైల్)

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం పంచాయతీ ముజ్జాడ పేటకు చెందిన ముంజాడ ఉమా మహేశ్వరరావు (30) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. విశాఖ పట్నంలోని మారికివలస గురుకుల పాఠశాలలో వార్డెన్‌గా పని చేస్తున్న ఉమామహేశ్వర పురుగుల మందు తాగి బల వన్మరణానికి పాల్పడినట్లు తెలిసింది. మృతుడికి తల్లిదండ్రులు నారాయణరావు, జ్యోతి, చెల్లె ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ ఘటనతో ముజ్జాడపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

నరసన్నపేట: నరసన్నపేట పరిధిలో జమ్ములోని మిల్లు వద్ద శనివారం ఆరుగురు వ్యక్తులను పేకాట ఆడుతుండగా పట్టుబడినట్టు హెచ్‌సి శేఖర్ తెలిపారు. మండలంలోని తలసముద్రపు రాజారావు, గొండ శ్రీనివాసరావు, సారవకోట సింహాచలం, గంగరాపు అప్పలరాజు, రుప్ప చిన్నరాయిడు, రావాడ రామారావు అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.14,910 స్వాధీనం చేసుకున్నామన్నారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిఐ మంగరాజు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- కంచిలి

కంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం మధ్యాహ్నం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, అక్రమంగా 24 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు. ఈ మేరకు సోంపేట సిఐ మంగరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఒడిశాకు చెందిన మిలన్ బిర, తనకి పిన్ని వరస అయిన దీపా లిమాతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నారని అన్నారు. కంచిలి రైల్వేస్టేషన్ వద్ద సోదాలు చేశామన్నారు. ఈ క్రమంలో వారి వద్ద రెండు బ్యాగుల్లో 12 ప్యాకెట్లలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని కనుగొన్నామని తెలిపారు. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఒడిశా ఆర్.ఉదయగిరికి చెందిన రాజు వద్ద 24 కిలోల గంజాయిని ఈ నెల 3న కొనుగోలు చేసి ముంబైలోని శంకర్ అనే వ్యక్తికి అందించేందుకు వెళ్తున్నట్లు నిందితులు తెలియజేసినట్లు చెప్పారు. సాయంత్రం కోణార్క్ రైలు అందించేందుకు ప్రయత్నించే క్రమంలో పోలీసులు చేస్తున్న తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ, సిబ్బందిని సిఐ అభినందించారు.

బెల్లం ఊటలు ధ్వంసం

సోంపేట: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు గ్రామాల్లో శనివారం సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో సుమారు పదివేల లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ జి.వి.రమణ తెలిపారు. గంజాం జిల్లాలోని గంగాపూర్ వద్ద 23 డ్రమ్ముల్లో నిలువుంచిన సుమారు 4500 లీటర్ల బెల్లం ఊటతో పాటు రామచంద్రపురం సరిహద్దులో 30 డ్రమ్ముల్లో ఉంచిన 5500 మీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో శ్రీకాకుళం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంటెంట్ రామచంద్ర కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంటెంట్ మురళీధర్, శ్రీనివాస్, ఎస్ఐ జగన్నాథం, ఒడిశా పోలీసులు పాల్గొన్నారు.

దాడుల్లో బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

వరి కుప్ప దగ్ధం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని గట్టుపై ఊరులో పొత్రియకు చెందిన సవర సుంకయ్య వరి కుప్ప శనివారం మధ్యాహ్నం దగ్ధమైంది. సవర సుంకరయ్య తన పొలంతో పాటు కవులకు చేస్తున్నారు. ఎకరా పొలంలో పండిన పంటను పొలంలో కుప్ప పెట్టారు. మధ్యాహ్నం సమయంలో వరి కుప్ప దగ్ధం కావడంతో విషయం తెలుసుకున్న సుంకరయ్య ఘటనా స్థలాన్ని చేరుకొనే సమయానికి పూర్తిగా వరి పంట దగ్ధమైంది. ప్రమాదం ఏలా జరిగిందో తెలియరాలేదు. కష్టపడిన పంట అంతా అగ్గి పాలైందని లబోదిబోమంటూ కన్నీరు పెట్టుకున్నారు. సుమారు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

దగ్ధమవుతున్న వరి కుప్ప

పి4 కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

బంగారు కుటుంబాలే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అట్టడుగు వర్గాల వారికి అన్ని విధాలుగా ఆదుకొని బంగారు కుటుంబాలుగా తయారు చేసేందుకు ముందుకు వచ్చిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ శ్రీకాకుళం శాఖ వారికి ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పీపుల్స్ ప్రైవేట్ పబ్లిక్ పార్ట్నర్షిప్ ద్వారా అట్టడుగు వర్గాల వారికి వైద్యపరంగా, విద్యాపరంగా, ఆర్థిక స్థితిగతుల పరంగా అన్ని విధాల ఆదుకొని వృద్ధి చెందే విధంగా కృషి చేసేందుకు ఐఎంఎ శ్రీకాకుళం వారు ముందుకు రావడం అభినందనీయమన్నారు. శనివారం స్థానిక కాకివీధి యుపిహెచ్‌సిలో నిర్వహించిన పీఫోర్ కార్యక్రమం ద్వార సామాన్యులకు అత్యుత్తమైన వైద్యులచే వైద్య సేవలు అందించారు. 1200 మందిని బంగారు కుటుంబాలు తయారు చేయడం లక్ష్యంగా ఐఎంఎ సంకల్పించిందని, అందులో భాగంగా మొట్టమొదటిగా ఈ కార్యక్రమం నిర్వహించారని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు విజన్ 2047 ద్వారా సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడే విధంగా తయారు చేయడానికి సంకల్పించే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని, భవిష్యత్‌లో మరింత మందిని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డిసిహెచ్‌ఎస్, ఐఎంఎ ప్రతినిధులు డాక్టర్ గొండు గంగాధర్, డాక్టర్ సనపల నరసింహమూర్తి, డాక్టర్ గుప్తా, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

నరసన్నపేట: హరేకృష్ణ ఉత్సవ కార్యక్రమంలో భాగంగా ఉత్సవ కమిటీ శనివారం పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, తువ్వాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈశ్వర ఛారిటబుల్ ట్రస్టు మారుపు విజయ్, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, ఇంజినీర్ కృష్ణ, పొట్నూరు సాయిప్రసాద్, టంకాల అర్జున్, పొట్నూరు శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న అన్వేష్

ఘనంగా సెమీ క్రిస్మస్

ఇచ్ఛాపురం: మండలంలోని ఈదుపురం ఒడియా చర్చ్‌లో రేవ భీమ్ బెహరా శనివారం ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎపి క్రిస్టియన్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి, వైసిపి నాయకులు డాక్టర్ ప్రత్తి అన్వేష్ పాల్గొని మాట్లాడారు. క్యాండిల్ సర్వీస్, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎలియా పాస్టర్, శేఖర్ పాస్టర్, మురళి పాస్టర్, ఆనంద్, ప్రకేస్‌బాబు పాల్గొన్నారు.

అరసవల్లి: క్రిస్టియన్ వర్షిప్ సెంటర్ చర్చిలో మహిళా క్రిస్టమస్ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు నృత్యాలు చేస్తూ అలరించారు. గోడి శామ్యూల్, లతా సుధీర్‌కుమార్, విజయరత్నం, నిషిగోడి పాల్గొన్నారు.

చిన్నబాడాం విద్యార్థుల ప్రతిభ

పలాస: వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి పాఠశాలలో నిర్వహించిన గ్రిక్స్ పోటీల్లో చిన్నబాడాం విద్యార్థులు ప్రతిభ చాటారు. సీనియర్స్ అండ్ జూనియర్ విభాగంలో అథ్లెటిక్స్‌లో బంగారు పతకం, ఏడు వెండి పతకాలు, ఏడు కాంస్య పతకాలతో పాటు జూనియర్ గర్ల్స్ బాల్ బ్యాడ్మెంటన్ సెకండ్ ప్లేస్‌ను కైవసం చేసుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు టి.గీతా, పాఠశాల హెచ్‌ఎం సిహెచ్. ఉషారాణి, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, ఉపాధ్యాయులు జగదీశ్వరరావు, గోవిందరావు, నగేష్, జయలక్ష్మి, ఉమాపతి, లక్ష్మీపతి అభినందించారు.

లోక్ అదాలత్‌తో ఇరువర్గాలకు సమన్యాయం

పొందూరు : లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ సరైన వేదిక అని, కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ పి.పరేష్ కుమార్ అన్నారు. కోర్టు ఆవరణలో జడ్జి అధ్యక్షతన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా 375 కేసులు పరిష్కారం అయ్యాయయని తెలిపారు. కార్యక్రమంలో ఎజిపి నాగరాజుపాత్రో, న్యాయవాదులు గిన్ని సీతయ్యరెడ్డి, ఎం.రాంబాబు, ప్రేమలత, సంతోష్ కుమార్ సాహు, ఎస్.ఎల్.నారాయణ, రంగారావు, ఎ.సత్యనారాయణ, సిఐ మీసాల చిన్నంనాయుడు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక కోర్టులో జడ్జి కందికట్ల రాణి అధ్యక్షతన నిర్వహించిన లోక్‌అదాలత్‌తో 440 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు సుధాకరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మహంతి అప్పారావు, న్యాయవాదులు ధర్మారావు, గేదెల ఫాల్గుణరావు, రాడ రాజు, రవి కిరణ్, హరిబాబు, ఉమామహేశ్వరరావు, ప్రసాద్, జానకిరామ్ సత్యనారాయణ దండాసి, సూర్యం పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : స్థానిక కోర్టులో జడ్జి ఎం.రోషిణి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. బెంచ్‌లో మొత్తం 192 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో అదాలత్ సభ్యులు బి.ధర్మారావు, ఎస్.తిరుపతి, న్యాయవాలు సంఘం మండల అధ్యక్షులు ఎల్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలాస : పలాస సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 620 కేసులు పరిష్కరించినట్టు జడ్జి మాధురి తెలిపారు. కేసులను రాజీ చేయడం, అపరాధ రుసుం వసూలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎపిపి రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బి.కేర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జిఎంఎస్ అనిల్‌రాజ్, ఎజిపి పిండి వెంకటరావు, సెక్రెటరీ బెండి కాళిదాస్, తాండ్ర మురళీమోహనరావు, పి.ఎల్.నారాయణ, ఎన్.విశ్వేశ్వరరావు, కాశీబుగ్గ సిఐ రామకృష్ణ, ఎస్ఐ నరసింహమూర్తి, ఎక్సైజ్ ఎస్ఐ బి.సయ్యద్, సూపరింటెంట్ కె.కృష్ణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : కాపీని అందజేస్తున్న జడ్జి పరేష్ కుమార్

సోంపేట : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టుల సముదాయం వద్ద నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 474 కేసులు పరిష్కరించినట్లు ఆరో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు కె.కిషోర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

పొందూరు: లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాలకు సమన్యాయం లభిస్తుందని జూనియర్ సివిల్‌జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. ఫస్టుక్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో జాతీయ లోక్‌అధాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ మెంబర్ కె.కృష్ణారావు, న్యాయవాదులు కె.రమణమూర్తి, డి.కిరణ్‌బాబు, ఎం.రాము, కె.అశోక్, వై.వి.బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలో ప్రైవేటుపరం చేయడంపై కోటి సంతకాల సేకరణ నిరసన ఉద్యమంలో భాగంగా ఈ నెల 15న శ్రీకాకుళం పట్టణంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యధికంగా 60 వేలు సంతకాలు సేకరించి జిల్లాలో నరసన్నపేట ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అందుకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల అధ్యక్షులు కనుసు సీతారాం, కణతి కృష్ణారావు, వరుదు వంశీకృష్ణ పాల్గొన్నారు.

రణస్థలం: ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైసిపి అధ్యక్షులతో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 15న శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో జిల్లా పార్టీ అధ్యక్షులతో సమావేశంలో పాల్గొనడానికి నియోజక వర్గం నుంచి వెయ్యి మంది కార్యకర్తలు హాజరు కావాలన్నారు. ఈనెల వైసిపి అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు రణస్థలంలో ఘనంగా నిర్వహించడం జరుగు తుందని, నాలుగు మండలాల వైసిపి శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసన్నపేట : మాట్లాడుతున్న కృష్ణచైతన్య

వేగం కంటే ప్రాణం మిన్న

ఎస్ఐ ప్రవల్లిక

ప్రజాశక్తి- బూర్జ

మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవల్లిక

వేగం కంటే ప్రాణాలు మిన్న అని ప్రయాణం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఐ ప్రవల్లిక అన్నారు. శనివారం ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రస్తుతం వేకువజామున విపరీతమైన మంచు కురుస్తుండడంతో వాహనదారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయి పొగమంచు దట్టంగా కమ్ముకొని ఉదయం 7 గంటలైనా రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనిపించని పరిస్థితి ఏర్పడుతున్నాయన్నారు. దీనివల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, పొగ మంచు మాటున ప్రమాదం పొంచి ఉందని, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లపై పొగ మంచు ఏర్పడటం వల్ల ప్రయాణం ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. పొగ మంచు కారణంగా వాహనానికి లైట్లు వేసుకున్నా ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కనిపించడం లేదన్నారు. వేగంగా ప్రయాణం చేస్తే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడమే కాకుండా ప్రాణాలకు ముప్పు వాటిళ్లే పరిస్థితులు నెలకుంటాయన్నారు. ఫిబ్రవరి నెల వరకు పొగ మంచు అధికంగా ఉంటుందని, వాహన చోదకులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇప్పటికే వాహనదారులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మోడల్ పేపర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి- నందిగాం
మండలంలోని లఖిదాస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వరాన తయారు చేసిన పదో తరగతి మోడల్ టెస్టు పేపర్లను శనివారం ఆవిష్కరించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు రెండు పుస్తకాలు యుటిఎఫ్ మండలశాఖ తరుపున ఉచితంగా సరఫరా చేశారు. ఈ పుస్తకం పరిపూర్ణంగా అవగాహన చేసుకుని చదివితే సుమారు 80 శాతం మార్కులు సాధించవచ్చునని అన్నారు. యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం ప్రభుత్వ బడుల పరిరక్షణ, సామాజిక స్పృహ కలిగిన సంఘంగా ఒకవైపు పోరాటం, ఇంకోవైపు అకడమిక్‌గా విద్యార్థులకు ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు తోడ్పడుతుంది. కార్యక్రమంలో యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్షులు కుమారస్వామి, జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.దాలయ్య పాల్గొన్నారు.

సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

గ్రంథాలయ సమస్యలపై వినతి

ప్రజాశక్తి- అరసవల్లి
గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలపైన, మూతపడిన గ్రంథాలయాలు, ఖాళీగా ఉన్న సిబ్బంది నియామకాలపై ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులకు శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సదస్సులో విజ్ఞాపన పత్రం అందజేసినట్టు జిల్లా గ్రంథాలయ శాఖ అసోసియేషన్ అధ్యక్షులు వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వటానికి, లైబ్రరీ సెస్ నేరుగా గ్రంథాలయాలకు జమయ్యే విధంగా సహకరిస్తామని ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఎ.కృష్ణమోహన్ హామీ ఇవ్వడంపై జిల్లా పెన్షనర్స్ సంఘ సభ్యులు ఆధ్వర్యంలో హర్షం ప్రకటిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ పెన్సనర్స్ సంఘం అధ్యక్షులు వైకుంఠరావు తెలిపారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయ శాఖ ఉపసంచాలకులు షేక్ పీర్‌అహ్మద్, గ్రంథాలయ పరిషత్ సభ్యులు సోమశేఖరరావు, అన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శులు, జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి శంకర్రావు, అసోసియేషన్ ప్రతినిధులు పి.ఉగ్రసేను, డి.గోపాలరావు, మురపాక శ్రీనువాసరావు, చంద్రశేఖర్, ఈశ్వరరావు, పూర్వ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- పోలాకి
మండలంలోని మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గ్రిగ్స్ క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని అన్నారు. ఓటమితో కూంగిపోకుండా గెలుపు దిశగా ప్రయత్నాలు చేసినప్పుడే ఆటల్లోనూ జీవితంలోనూ ఉన్నత స్థాయికి చేరుతారని అన్నారు. గ్రామాలకే అంకితం కాకుండా జిల్లా, రాష్ట్ర అంతర్జాతీయ స్థాయిలో క్రీడారంగంలో రాణించాలని కోరారు. కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం హెచ్‌ఎం రాధాకృష్ణకు ఎమ్మెల్యే దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జోగినాయుడు

ఐజాక్ సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి- శ్రీకాకుళం
వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రగతికి అంకితభావంతో సేవలందించిన ఎస్.ఐజాక్ అజాత శత్రువుగా అందరి అభిమానాన్ని చూరగొన్నారని, వాకర్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీగా ఐజాక్ అందించే సేవలు వెలకట్టలేనివని స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. శనివారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో అకాల మరణం చెందిన ఐజాక్ సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టార్‌వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు గేదెల ఇందిరా ప్రసాద్ మాట్లాడుతూ జిల్లావిద్యాశాఖ అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ అభివృద్ధికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి ఐజాక్ అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ పీజీ గుప్తా, క్లబ్ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, క్లబ్ ప్రతినిధులు గేదెల లక్ష్మి, సుగంధం సంజీవరావు, డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాదరావు, నాగేశ్వర ఈశ్వరరావు, దివ్వ కృష్ణారావు, గుడ్ల జగ్గారావు, జి.వాసుదేవరావు, మెట్ట బట్లు, సాయిరామ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంలో 2019-24 మధ్య మంజూరై వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సోషల్ డెవలప్ మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు లబ్ధిదారులను కోరారు. మండలంలోని పూండిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వివిధ తరగతులకు ప్రత్యేకంగా ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి అదనపు సహాయం అందిస్తుందని తెలిపారు. బిసి, ఎస్‌టిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష చొప్పున కూటమి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ అదనపు సహాయం సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి పేదవాడి సొంతింటి కల నిజం నిజం చేసుకోవాలని కోరారు.

మల్లేశ్వరరావు

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి- అరసవల్లి
నగరానికి చెందిన శివనృత్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు, నృత్య దర్శకులు, రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి సప్తమి మహోత్సవం కార్యక్రమం శనివారం బాపూజీ కళామందిర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ సీనియర్ శిష్య బృందంచే గణేష్నుతి నృత్య ప్రదర్శన, కూచిపూడి, మోహిని అవతార ప్రదర్శన, భరతనాట్యం, ఒడిశా నృత్య ప్రదర్శన, కర్ణాటక నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన నట్టువంగం, మృదంగం కళాకారుడు రఘునాథంకు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా హైదరాబాద్ చెందిన కూచిపూడి నృత్య కళాకారుడు ఎం.సురేంద్రనాథ్‌కు, వెస్ట్ బెంగాల్ కలకత్తాకు చెందిన కథక్ నృత్య కళాకారుడు సౌరవ్ రోయ్‌ను, రాజమహేంద్రవరానికి చెందిన భరతనాట్యం కళాకారుని హరిప్రియ ప్రణేష్‌ను, హైదరాబాద్‌కు చెందిన మహినిట్టం కళాకారిని బిజినా సురేంద్ర నాథ్‌ను, భువనేశ్వర్‌కు చెందిన భరతనాట్యం కళాకారిని బెహరా

నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ప్రీతిప్రియలను శివ నృత్య నికేతన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో శ్రీకాంత్ అనేక వేదికలపై అధునాతన నృత్య ప్రదర్శనలు ఇచ్చి శ్రీకాకుళం జిల్లాకే కాకుండా తెలుగు రాష్టాల్లో కీర్తి ప్రతిష్టలు తెచ్చారన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన రావు మాట్లాడుతూ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎంతో మందిశిష్యులు తయారు చేయడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో ఉమా దేవి, పద్మావతి, కిమ్మి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

ప్రజాశక్తి- పలాస
పలాస నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ మేరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలతో ఎక్కువ మంది ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చాయన్నారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఎక్కువగా ఇళ్ల స్థలాలు, మంజూరు, వృద్ధులకు, స్పౌస్ పెన్షన్లు, రోడ్లు, విద్యుత్ దీపాలు, మురుగు కాలువలు ఏర్పాటు, జీరో ఎక్సెంట్ పాసు బుకులు కోసం వినతులు వచ్చినట్లు చెప్పారు. 25 వినుతులు రాగా, వీటిపై కొన్నిటిని ఫోన్లో అక్కడికక్కడే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేశామన్నారు. మిగతా వాటిని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

శిరీషకు సన్మానం

స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే టిడిపి నాయకులు సన్మానం చేశారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విఠల్‌రావుకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ప్రభుత్వం నియమించడంతో సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, సవర రాంబాబు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి- నరసన్నపేట
డిజిటల్ టెక్నాలజీ కారణంగా బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నరసన్నపేట స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ చీఫ్ మేనేజర్ డి.మధుసూదనరావు సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకింగ్ సేవలు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాయన్నారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బ్యాంకింగ్ సేవలపై శనివారం అవగాహన కల్పించారు. ఆన్ ది జాబ్ ట్రైనింగ్ లో భాగంగా అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ ఒకేషనల్ విద్యార్థులకు రెండో శనివారం కావడం వల్ల ప్రత్యేక క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. సాధారణ తరగతులతో పాటు, ఆన్ ఫీల్డ్ ప్రాక్టీస్ ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి పేర్కొన్నారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి రేగ సురేష్

అవగాహన కల్పిస్తున్న మధుసూదనరావు

కుమార్ ఆదేశాల మేరకు, ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల అనుమతితో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బ్యాంకింగ్ రంగంలో డిజిటల్ కార్యకలాపాలు, డిపాజిట్లు, విత్ డ్రాయల్స్, నెఫ్ట్, ఆర్‌టిజిఎస్ ద్వారా చెల్లింపులు తదితర అంశాలపై మేనేజర్‌తో విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

నరసన్నపేట : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐ శ్రీనివాస్

మత్తు రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి- నరసన్నపేట
మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ నాశనం అవుతుందని నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. 'హలో యువత మేలుకో చెడు వ్యసనాల నుంచి నిన్ను నువ్వు కాపాడుకో' అనే నినాదంతో యువతకు మత్తు పదార్థాలపైన అవగాహన కల్పించేందుకు ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యాన ముద్రించిన పోస్టర్‌ను సిఐ, జలుమూరు, సారవకోట, పోలాకి ఎస్‌ఐలతో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత విద్యార్థి దశలోనే పుస్తకాలపై శ్రద్ధ పెడితే ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, ఎఐవైఎఫ్ శ్రీకాకుళం టౌన్ కన్వీనర్ వై.వేణు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మత్తు రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల కో-ఆర్డినేటర్ దూసి శ్రవణ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గణపతి ధనంజయరావ్ అధ్యక్షతన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల, వసప కెజిబివి, వెంకటేశ్వర, వెంకటసాయి డిగ్రీ కళాశాలల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సోంపేట : మాదకద్రవ్యాల నివారణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మంగా తీసుకున్న నిర్ణయాన్ని పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బారువ జూనియర్ కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ సౌజన్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణపై చైతన్యం చేస్తే సమాజంలో యువత చెడు మార్గంలో వెళ్లకుండా ఉండటానికి అవకాశం కలుగుతుందన్నారు. బారువ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎల్.మోహన్, ఆంగ్ల అధ్యాపకులు పద్మనాభ చౌదరి, తెలుగు అధ్యాపకులు ఇచ్చు సుధాకర్ పాల్గొన్నారు.

సరుకులు అందజేస్తున్న టిడిపి నాయకులు

'మొంథా' సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి
సంతబొమ్మాళి మండలం భావనపాడులో ఇటీవల సంభవించిన మొంథా తుపాను కారణంగా నష్టపోయిన బాధితులకు టిడిపి నాయకులు రేషన్ సరుకులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తుపాను ప్రభావంతో వేట కోల్పోయిన పేద మత్స్యకార కుటుంబాలకు తక్షణ ఉపశమనంగా ప్రభుత్వం ఆదుకుందని అన్నారు. అవసరం ఉన్న ప్రతి కుటుంబానికీ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బి.తులసీదాసు, జి.ఆది నారాయణ, చంద్రయ్య, కారాడ జంగమయ్య, పోతయ్య, గురువులు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎపిఎం మనోరత్నం

జెండర్ వివక్షతపై అవగాహన

ప్రజాశక్తి- నందిగాం
మండలంలోని పెద్దతామరపల్లిలో ఉన్న విఒల జెండర్ వివక్షత వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం శనివారం చేపట్టారు. కార్యక్రమంలో ఎపిఎం మనోరత్నం పాల్గొని ప్రతిజ్ఞ చేపించారు. ఆడ పిల్లలు చదువు, వివాహ వయసు, ప్రయాణ భద్రత, కుటుంబ సమస్యల పరిష్కారాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో విఒఎ సుహాసిని, గ్రామ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బెంచీని ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ సత్యరాజు

సిమెంట్ బెంచీలు వితరణ

కోటబొమ్మాళి : మండలంలోని శ్రీజగన్నాథపురం సర్పంచ్ నూక సత్యరాజు తల్లిదండ్రులు కీర్తిశేషులు గోవిందరావు, రాములమ్మ జ్ఞాపకార్థం రూ.30 వేలుతో పది కూర్చున్న సిమెంట్ బెంచీలను శనివారం వితరణగా ఇచ్చారు. గ్రామస్తులు ముఖ్యంగా వృద్ధులు విశ్రాంతి సమయాల్లో సేద తీర్చుకునేందుకు ఉపయోగపడే విధం గా అవసరమైన పదిచోట్ల వాటిని ఏర్పాటు చేశారు. సత్య రాజు దాతృత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలి పారు. ఇటువంటి కార్యక్రమాలే శాశ్వతంగా నిలిచిపోతా యని, ఇవి ఎంతో ఉపయోగకరమని గ్రామస్తులు కొనియాడారు.

స్థల పరిశీలన

సోంపేట: పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో మినీ కళ్యాణ మండపం నిర్మించేందుకు ఉన్న అవకాశాలను మాజీ మంత్రి శివాజీ శనివారం పరిశీలించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బీన ఆనందరావు, సభ్యులు డి.ప్రకాష్, ఎం.రాము, డి.రాము, ప్రదీప్ బెజ్జో, రాఘవ దాస్, పి.రాజు, జి.శంకర్, డి.చిరంజీవితో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలి ంచారు. మినీ కళ్యాణ మండపం ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శివాజీ

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- మెళియాపుట్టి
మండలంలోని సుందరాడ పంచాయతీ అప్పాజీపేటకు చెందిన సవర సన్ముఖరావుకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తన క్యాంప్ కార్యాలయంలో సిఎం సహాయనిధి చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన షణ్ముఖరావు అనారోగ్యానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయడని తెలిపారు. ఇదే విషయానికి తనకు విన్నవించుకోగా ఆర్థిక పరిస్థితిని సిఎం చంద్రబాబునాయుడుకు తాను వివరించినట్టు చెప్పారు. సిఎం స్పందించి రూ. 56,309 చెక్కును మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు ఎస్.ఎల్లమ్మ నాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస: సిఎం సహాయనిధితో పేదలకు భరోసా కలగనుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 18వ వార్డు

ఆమదాలవలస : రేవతికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

బొడ్డేపల్లి పేటలో నివసిస్తున్న తమ్మినేని రేవతి ద్విచక్ర వాహన ప్రమాదానికి గురైన రేవతి ఇంటికి ఎమ్మెల్యే రవికుమార్ వెళ్లి ప్రభుత్వం తరపున మంజూరైన రూ.81 వేలు సహాయనిధి చెక్కును అందజేశారు. రేవతి యోగ క్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాల బారిన పడి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సిఎం సహాయనిధి ఎంతో ఊరట కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బగాది భాస్కరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిషత్ స్థలం కబ్జా

ప్రజాశక్తి- పలాస
ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు సెలవు రోజుల్లో ఆక్రమించడం... ఆ తరువాత కొద్దికొద్దిగా పనులు చేపడుతున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులు పదేపదే చెబుతున్నా అక్రమార్కులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే తరహాలో పలాస మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న పంచాయతీరాజ్ డిఇ కార్యాలయం వెనుక భాగం స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. చిన్న స్థలం అయినా కోట్లు విలువచేసే కావడంతో ఆక్రమించుకొని నిర్మాణం చేపడుతున్నామన్నారు. గత ఆరు నెలలుగా కార్యాలయానికి తూర్పు భాగంలో ఉన్న ప్రైవేటు వ్యక్తి కొద్ది కొద్దిగా మండల పరిషత్ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల పరిషత్ అధికారులు వాటిని అడ్డుకున్నారు. అక్కడితో నిర్మాణం చేపట్టడం ఆపివేశారు. శని, ఆదివారాలు సెలవు రోజులు

పిల్లర్లను వేసిన ఆక్రమణదారులు

కావడంతో గతంలో నిర్మాణం చేపట్టిన పిల్లర్లను కలుపుకుని గోడ నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న పలాస ఎంపిడిఒ వసంత కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, అధికారులు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించడం తప్పు అని, మరలా పునరావృతమైతే నిర్మాణం తొలగిస్తామని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఎంపిడిఒ వసంతకుమార్‌ను వివరణ కోరగా, ప్రభుత్వ స్థలంలో నిర్మాణ పనులు చేపట్టడం వాస్తవమేనని, నిర్మాణ పనులు జరగకుండా పదేపదే అడ్డుకుంటున్నామని చెప్పారు. ఆరు నెలలుగా చెబుతున్న పనులు చేస్తున్నారని, సర్వే చేపట్టి అక్రమ నిర్మాణాలు తొలగిస్తామని తెలిపారు.

ఆరామ ద్రావిడ సంఘం ఆత్మీయ కలయిక

ఎన్నికైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- అరసవిల్లి
నగరంలో ఆరావ ద్రావిడ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో 80 అడుగుల రోడ్డులో ఉన్న టిడిపి జిల్లా కార్యాలయం వద్ద శనివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. అందరూ సంస్కృతి, సాంప్రదాయాలు కాంక్షించాలని ఆరామ ద్రావిడ సంఘం అధ్యక్షులు ఇప్పిలి శంకర్ శర్మ అన్నారు. పేద బ్రాహ్మణులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆటల పోటీలు, క్విజ్ కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా బంకుపల్లి సత్య నారాయణ శర్మ ఆధ్వర్యంలో కచేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరామ ద్రావిడ సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. గౌరవ అధ్యక్షులుగా రేజేటి రామా చార్యులు, వేమకోటి నర్సింగరావు శాస్త్రి, వేమకోటి సూర్యనారాయణ శర్మ, అధ్యక్షులుగా ఇప్పిలి శంకర్ శర్మ, కార్యదర్శిగా జోశ్యుల శివప్రసాద్ శర్మ, కోశాధికారిగా ధర్మపురి గౌరీ శంకర్ శాస్త్రి, సుసరాపు లక్ష్మీ గణపతి శర్మ, కార్యదర్శులుగా తాళ్లపూడి రవి ప్రతాప్ శర్మ, అంపోలు ఉమామహేశ్వర శర్మ, పుల ఖండం కృష్ణమూర్తిలను ఎన్నుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొని పలువురికి సత్కరించారు.

గణిత అవధానంపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట
ఏకాగ్రతపై మనస్సు కేంద్రీకరించి, గణన చేయడమే గణిత అవధానం గణిత అవధాని మడ్డు తిరుపతిరావు మాస్టర్ అన్నారు కొర్లాంలోని బాలకృష్ణ జూనియర్ కళాశాల ఆవరణలో డైరెక్టర్, ప్రముఖ మనో వికాస నిపుణులు రాంబుడ్డి గణపతి అధ్యక్షతన శనివారం నిర్వహించిన 273వ గణిత దశావధానం కార్యక్రమం ఆద్యంతం అలరించింది. గణితం అంటే భయం అవసరం లేదని, సరిగ్గా అర్థం చేసుకుంటే అన్నిటికంటే గణిత శాస్త్రం సులభమైనది అన్నారు. అలాగే శత శాతం మార్కులు వస్తాయని అన్నారు. గణిత సమస్య సాధనలో వేగం, కచ్చితత్వం చాల ముఖ్యమైనవి అన్నారు. అనంతరం తిరుపతిరావు మాస్టర్‌ను జ్ఞాపికలతో ఘనంగా

తిరుపతిరావును సన్మానిస్తున్న గణపతి

సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది హరికృష్ణ, కోదండరావు, యుంగధర్, వెంకటరావు, నరేంద్ర పాపారావు, తాతారావు, తులసీదాసు, సురేష్, మోహనరావు, ఆనందరావు, జ్యోతి పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నౌపడ విద్యార్థులు

కబడ్డీలో నౌపడ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- సంతబొమ్మాళి
పల్నాడు జిల్లా పెద్దకూరపాడులో డిసెంబరు 10 నుంచి 12 వరకు నిర్వహించిన 51వ రాష్ట్రస్థాయి జూనియర్ అండర్-20 కబడ్డీ పోటీల్లో జిల్లా జట్లు ప్రతిభ చాటాయి. బాలికల జట్టు ద్వితీయ స్థానం, బాలుర జట్టు తృతీయ స్థానం సాధించాయి. ఈ విజయాల్లో నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కీలక పాత్ర పోషించారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పరపటి హరిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం భానుప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.జనార్ధనరావు, డి.శ్యాంకాంతారావు, ఉపాధ్యాయ సిబ్బంది, ఎస్‌ఎంసి చైర్మన్ కర్రి గిరిబాబు విద్యార్థులను అభినందించారు.

పరామర్శ చేస్తున్న కృష్ణదాస్

కృష్ణదాస్ పరామర్శ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి
మండలంలోని గద్దలపాడులో లక్కివలస ఎంపిటిసి చింతల రాజులు కుమారుడు, జియాలజిస్టు సంతోష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ మృతుని కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గద్దలపాడు సర్పంచ్ శ్రీరంగం వీరస్వామి, కొల్లిపాడు సర్పంచ్ సవరయ్య, డి.జి.పురం సర్పంచ్ మార్పు నాగభూషణం, మలగాం సర్పంచ్ సూరాడ వెంకటేష్, జగన్నథపురం సర్పంచ్ రాములమ్మ, టెక్కలి నియోజకవర్గ వైసిపి యువజన విభాగ అధ్యక్షుడు చిన్ని జోగారావు యాదవ్ పాల్గొన్నారు.

16న మండల సమావేశం

ప్రజాశక్తి - సీతంపేట
ఈనెల 16న మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బిబి మిశ్రా తెలిపారు. ఎంపిపి అధ్యక్షతన స్థానిక ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయంలో జరగనున్న సమావేశానికి కావున అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం
స్థానిక హనుమాన్ జంక్షన్‌లో ఎస్ఐ ఎం.రాజేష్ శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గతంలో పెండింగ్ ఉన్న కేసులు అపరాధ రుసం చెల్లించి కేసులు క్లియర్ చేసుకోవాలన్నారు. వాహనాల పత్రాలను వాహనదారుల నుంచి పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి
మండలంలోని రావుపల్లిలో ఎస్‌సి కాలనీలోని పేదలకు గుంట్రెడ్డి శ్రీనివాసరావు అందజేసిన దుప్పట్లను సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, బోను కుమారి చేతుల మీదుగా శనివారం అందజేశారు. దళిత కాలనీలో దాదాపు 110 కుటుంబాలకు దుప్పట్లు అందజేసిన దాత గుంట్రెడ్డి శ్రీనివాసరావును సర్పంచ్ అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో సర్పంచ్ మహేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని కోరారు. దాతల సహకారంతో గ్రామంలో పెద్ద ఎత్తున సామాజిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పంచాయతీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో బోను కుమారి, జి.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.